క్లుప్తంగా

గ్రూప్‌- 1 ఫలితాల్లో గునగంటి సతీష్‌ ప్రతిభ



మోతె : గ్రూప్‌-1 ఫలితాల్లో మోతె మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన గునగంటి సతీష్‌ 464 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు. ఆయన ప్రస్తుతం సూర్యాపేట మున్సిపాలిటీ కార్యాలయంలో గ్రూప్‌-4 స్థాయి ఉద్యోగం చేస్తున్నారు.

టాలెంట్‌ టెస్ట్‌లో ఫస్ట్‌ ర్యాంక్‌



బహుమతి అందుకుంటున్న సాన్వికప్రజ్ఞ

హుజూర్‌నగర్‌ : పట్టణానికి చెందిన చింతలపూడి రాజేష్‌- దివ్య కూతురు సాన్వికప్రజ్ఞ ఎయిమ్స్‌ ఒలింపియాడ్‌ హంట్‌ జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన గణితం, సైన్స్‌ టాలెంట్‌ సెర్చ్‌ పరీక్షలో ప్రథమ ర్యాంక్‌ సాధించింది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థి బహుమతి అందుకుంది. సాన్వికప్రజ్ఞ గ్రీన్‌వుడ్‌ పాఠశాల రెండవ తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా మంగళవారం సాన్వికప్రజ్ఞను పాఠశాల యాజమాన్యంతో పాటు కాలనీవాసులు అభినందించారు.

వరిలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ రజిని

కోదాడరూరల్‌ : వరిలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారిణి పాలెం రజిని అన్నారు. మంగళవారం మండలంలోని కాపుగల్లులో వరి పొలాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం వరి పంటకు అగ్గితెగులు, సుడిదోమ, కంపునల్లి తెగులు వ్యాపించిందని, తెగుళ్ల నివారణకు అధికారుల సూచనలు పాటిస్తూ మందులు పిచికారీ చేయాలని అన్నారు. ఆమె వెంట ఏఈఓలు ఝాన్సీ, మహేష్‌, సల్మా, నగేష్‌, పాలంపల్లి వీరబాబు, రాంనరేష్‌, అప్పారావు ఉన్నారు.

మండల అధ్యక్షుడిగా సైదిరెడ్డి



మునగాల : సమాచార హక్కు చట్టం వికాస సమితి మునగాల మండల శాఖ అధ్యక్షుడిగా మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ముస్కుల సైదిరెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో సమితి జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందరెడ్డి సైదిరెడ్డికి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునగాలలో సైదిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు సేవ చేయడానికి తగిన అవకాశం లభించిందన్నారు. సమితి నిమయ, నిబంధనలకు లోబడి వ్యవస్థాపక అధ్యక్షుడి ఆదేశాలకు కట్టుబడి, కమిటీ నిర్ణయాల ప్రకారం నడుచుకుంటానని తెలిపారు.

'మైహోం'లో ముగిసిన భద్రతా వారోత్సవాలు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని మైహోం సిమెంట్‌ పరిశ్రమలో నిర్వహిస్తున్న 54వ జాతీయ భద్రతా వారోత్సవాలు మంగళవారం ముగిసాయి. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా డిప్యూటీ చీఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ ఫ్యాక్టరీస్‌ కె.వి.శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మైహోం పరిశ్రమలో విధిగా భద్రతా నియమాలు పాటిస్తున్న ఉద్యోగులు, కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు భద్రతపై నిర్వహించిన లఘు నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ వైస్‌ ప్రెసిడెంట్‌ ఉత్తమ్‌సింగ్‌, సేఫ్టీ డీజీఎం సూర్యనారాయణ, పర్సనల్‌ సీనియర్‌ జనరల్‌ మేనేజర్‌ నాగేశ్వరరావు, వేణునాయుడు, కిషన్‌, నవీన్‌, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి



కరివిరాలలో గొర్రెల షెడ్‌ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

నడిగూడెం : ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ దాసరి సంజీవయ్య కోరారు. మంగళవారం నడిగూడెం మండలంలోని కరివిరాలలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పశువుల కొట్టం నిర్మాణ పనులను, గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు, నర్సరీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత వేసవిలో కూలీలు ఉపాధి హామీ పనుల్లో సమయ పాలన పాటించాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి అన్వర్‌, తదితరులు ఉన్నారు.

వరిచేలు.. జీవాల పాలు

- ఎస్సారెస్పీ ఆయకట్టులో సాగు చేసిన వరి పొలాలకు అందని సాగునీరు
- భూగర్భజలాలు పడిపోయి అడుగంటిన బోర్లు, బావులు
- మునగాల మండలంలో వంద ఎకరాలకు పైనే ఎండిపోయిన వరి
- ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతుల వేడుకోలు



నేలమర్రిలో ఎండిపోయిన వరిపొలంలో మేస్తున్న గొర్రెలు

మునగాల : ఎస్సారెస్పీ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయకపోవడంతో మునగాల మండలంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో సాగు చేసిన వరి చేలు ఎండిపోయాయి. నేలమర్రి రెవెన్యూ పరిధిలో గల నేలమర్రి, ఈదులవాగు తండా, మరసకుంట తండా, తాడువాయి రెవెన్యూ పరిధిలోని వెంకట్రాంపురం గ్రామాల్లో వంద ఎకరాల వరి పైరు పూర్తిగా ఎండిపోయింది. మరో మూడు వందల ఎకరాల వరి చేను ఎండిపోయే దశలో ఉంది. నేలమర్రి రెవెన్యూ పరిధిలో 700 ఎకరాల్లో వరిసాగు చేశారు. ఎస్సారెస్పీ నీరు రాకపోవడంతో భూగర్భజల వనరులు గణనీయంగా పడిపోయి బోర్లు, బావులు ఎండిపోయాయి. ఫలితంగా సాగునీరు అందక వరిపైర్లు కళ్లముందే ఎండిపోవడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.25 నుంచి 30 వేల వరకు పెట్టుబడి పెట్టామని అంటున్నారు. ఎండిపోగా, మిగిలిన వరి చేలకు నీరు అందించేందుకూ రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొందరు రైతులు ఎండిపోయిన వరి చేలలో గొర్రెలు, గేదెలను మేపుతున్నారు. నేలమర్రిలో తాను సాగు చేసిన వరి పంట ఎండిపోవడంతో బట్టుపల్లి సుందరయ్య అనే రైతు అందులో ద్విచక్ర వాహనం నడిపిస్తూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశాడు. ఎస్సారెస్పీ కాలువకు వారబందీ పద్ధతిలో సాగు నీరు విడుదల చేస్తామని అధికారులు ప్రకటించడంతో తాము యాసంగి సీజన్‌లో వరి సాగు చేశామని, తీరా సాగు చేశాక నీటినీ విడుదల చేయకపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎండిన తన వరిపొలంలో బైక్‌ నడిపి నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సుందరయ్య

ఏడెకరాలు ఎండిపోయింది



నేను ఏడెకరాల్లో వరి సాగుచేశాను. ఇప్పటివరకు ఎకరాకు సుమారు రూ.25 వేలు పెట్టుబడి పెట్టా. ఎస్సారెస్పీ కాలువకు సాగునీటిని విడుదల చేయకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా తగ్గి బోర్లు, బావుల ఇంకిపోయాయి. ఫలితంగా పొలాలకు సాగునీరు అందలేదు. నాకు దాదాపు రూ.లక్షన్నర నష్టం వాటిల్లింది.

– బట్టుపల్లి సుందరయ్య, నేలమర్రి

ప్రభుత్వం ఆదుకోవాలి



గత వానాకాలం సీజన్‌లో మాకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా పుష్కలంగా సాగు నీరు అంది పంటలు బాగా పండాయి. ప్రస్తుతం సాగు నీరు విడుదల చేయకపోవడంతో భూగర్భ జలాలు పడిపోయి బోర్లు పోయక సాగుచేసిన రెండెకరాల వరి పంట ఎండిపోయింది. నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

– మూడు సైదులు, ఈదులవాగుతండా

నాలుగు బోర్లు వేశా



నా భూమి తాడువాయి రెవెన్యూ పరిధిలో ఉన్నప్పటికీ గతంలో ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగునీరు వచ్చింది. దీంతో ప్రస్తుతం నాలుగు ఎకరాలు సాగు చేశాను. గత నెల రోజులుగా సాగునీరు రాకపోవడంతో సుమారు రూ.లక్షన్నర వ్యయం చేసి నాలుగు బోర్లు వేశాను. అయినా సరిపడ నీరు అందలేదు. దీంతో రెండెకరాలు పూర్తిగా ఎండిపోయింది. మిగతా రెండెకరాలు కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నా.

– రెణబోతు సైదిరెడ్డి, తాడువాయి

గొర్రెలకు మేతగా మారింది



నాకున్న కొద్దిపాటి పొలంతో పాటు మరో నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని సాగుచేశా. తొలుత భూమిలో ఉన్న బోరు బాగానే పోయడంతో ఇప్పటివరకు సుమారు నాలుగు ఎకరాలపై రూ.లక్ష వ్యయం చేశా. మరో నెలరోజుల్లో పంట చేతికి వస్తుందన్న తరుణంలో భూగర్భజలాలు పూర్తిగా పడిపోయి బోరు ఎండిపోయింది. దీంతో సాగు నీరు అందక నాలుగు ఎకరాలు ఎండిపోయింది. ఎండిపోయిన వరిపొలాన్ని గొర్రెలు మేపుకోవడానికి ఇచ్చా. సుమారు రూ.లక్ష నష్టం వచ్చింది.

– గుడిపూడి శంకర్‌, రైతు, నేలమర్రి

వంద ఎకరాల వరి పైర్లు ఎండిపోయాయి



నేలమర్రిలో ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో 750 ఎకరాల్లో వరి సాగుచేశారు. కాలువకు నీటి విడుదల చేయకపోయినప్పటికీ బోర్లు, బావుల ఆధారంతో రైతులు సాగు చేశారు. కానీ భూగర్భజలాలు పడిపోవడంతో బోర్లు, బావులలో నీరు లభించక సుమారు 100 ఎకరాల్లో వరిపైర్లు ఎండిపోయాయి. మిగిలిన వరి పంటకు రైతులు ఆరుతడి పద్ధతిలో నీరందించి కాపాడుకుంటున్నారు.

– బుంగా రాజు, మండల వ్యవసాయాధికారి, మునగాల

సీపీఎం ప్రజాపోరు యాత్ర ప్రారంభం



రాఘవాపురంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మోతె : మండల వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న 15 అంగన్‌వాడీ భవనాలకు బిల్లులు విడుదల చేసి పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు కోరారు. మంగళవారం మండలంలోని రాఘవాపురం గ్రామంలో సీపీఎం ప్రజాపోరు యాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో సగం నిర్మించి వదిలేసిన అంగన్‌వాడీ భవనాన్ని నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. రాఘవాపురంలో క్రీడా ప్రాంగణంలో క్రీడా వస్తువులు ఏర్పాటు చేయకుండా అక్రమంగా బిల్లులు తీసుకున్నారని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, క్రీడా ప్రాంగణాలను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు కిన్నెర పోతయ్య, కక్కిరేణి సత్యనారాయణ, భగత్‌సింగ్‌, కొమ్ము క్రాంతికుమార్‌, ఒగ్గు సైదులు, పద్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌

గరిడేపల్లి : హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం విఫలమైందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌ ఆరోపించారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలో యడ్ల అంజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రైతు సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండు లక్షలకు కన్నా ఎక్కువ తీసుకున్న రుణాలను కూడా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మాఫీ చేయాలని డిమాండ్‌ చేశారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయని ప్రజాప్రతినిధులు వేదికలపై మాత్రం రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకోవడం సరైంది కాదన్నారు. రుణమాఫీ కాకపోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారని తెలిపారు. అనంతరం మండల రైతు సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉద్దోజు సూర్యనారాయణ, పోకల వెంకటేశ్వర్లు, త్రిపురం సుధాకర్‌రెడ్డి, కడియాల అప్పయ్య, కుందూరు వెంకటరెడ్డి, ప్రతాని సైదులు, పోకల ఆంజనేయులు, షేక్‌ నబి, మెండే లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తొగర్రాయిలో బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న చైర్మన్‌, కమిటీ సభ్యులు, అర్చకులు

కోదాడరూరల్‌ : మండలంలోని తొగర్రాయిలో సంతాన వేణుగోపాలస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ చైర్మన్‌ అమరనాయిని వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆలయం వద్ద బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. బుధవారం సుప్రభాత సేవతో పాటు పలు పూజ కార్యక్రమాలు, 13న మామిడి తోరణాల అలంకరణ, ఉత్సవ మూర్తులకు నవకలశ పంచామృతాభిషేకం, నూతన పట్టు వస్త్రాల సమర్పన, రాత్రి గ్రూప్‌ డ్యాన్స్‌ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న స్వామి వారి కల్యాణం, 15న సుదర్శన నరసింహహోమం, 16న గరుడవాహనసేవ, 17న పవళింపు సేవ, 18న హనుమాన్‌ చాలీసా పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు విష్ణువర్ధనచార్య, పుల్లేశ్వరశర్మ, నందుల లక్ష్మీనరసింహశాస్త్రి, బుడిగం నాని, ప్రభాకర్‌రావు, పుల్లయ్య, సింగరయ్య, ఉపేందర్‌, ఎర్రయ్య, ఏడుకొండలు ఉన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లిలో గల శివాలయంలో శ్రీవల్లీ, దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాల మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్‌, మట్టపల్లిరావు, అర్చకులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో అధికారులు, హరితదళం సభ్యులు, విద్యార్థులు

కోదాడ : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని కోదాడ మండల విద్యాధికారి ఎండీ సలీం షరీఫ్‌ అన్నారు. మంగళవారం కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ హరితదళం ఆధ్వర్యంలో పర్యావరణహితమైన సబ్బులు, వంట సామగ్రిని శుభ్రం చేసే లిక్విడ్‌ తయారీపై శిక్షకుడు ఎం.కార్తీక్‌ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇళ్లలో వాటిని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. అనంతరం విద్యార్థులకు ఉచితం టీ షర్టులు, క్యాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు పర్యావరణహితమైన ఉత్పత్తుల తయారీపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ హరితదళం రాష్ట్ర ప్రాజెక్ట్‌ డైరెక్టర్‌ రాజశేఖర్‌, జిల్లా సైన్స్‌ అధికారి ఎల్‌.దేవరాజ్‌, ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎం. వి.మీనాక్షి, దండాల మధుసూదన్‌రెడ్డి, బడుగుల సైదులు, జాతీయహరిత దళం గైడ్‌ టీచర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్మీడియట్‌ పరీక్షలు

హుజూర్‌నగర్‌ : పట్టణంలో ఇంటర్‌ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన ఆప్షనల్‌ పరీక్షలకు ప్రభుత్వ జూనియర్‌లో 218 మంది విద్యార్థులకు గాను 202 మంది, ప్రియదర్శిని జూనియర్‌ కళాశాలలో 302 మందికి గాను 288 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా కళాశాలల చీఫ్‌ సూపరిటెండెంట్లు బ్రహ్మచారి, ప్రణతి తెలిపారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



కరివిరాలలో ఎండిన పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

నడిగూడెం : మండలంలోని కరివిరాలలో ఎల్‌- 35 ఎత్తిపోతల పథకం కింద నీరందక పొలాలు ఎండి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కరివిరాలలో ఎండిపోయిన పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. నీటి పారుదల శాఖ సిబ్బంది సరిగా నీటిని విడుదల చేయకపోవడంతో పొలాలు ఎండిపోయాయని ఆరోపించారు. ప్రతి రైతుకు ఎకరానికి రూ.30 వేల నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఆయన వెంట సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మండల కమిటీ సభ్యుడు ఎస్‌కె.మస్తాన్‌, గ్రామశాఖ కార్యదర్శి కేశగాని భద్రయ్య, రైతులు రామచంద్రారెడ్డి, గని, నరేష్‌, వీరబాబు, చంద్రం, రఫీ, వెంకమ్మ, రాంబాయి, నాగమ్మ, పున్నమ్మ, పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం



మఠంపల్లి : అంత్యాతండాలోని మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం

మఠంపల్లి : మండలంలోని అంత్యాతండా మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి అలరించారు. అధికారులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అల్లీపురం కాంప్లెక్స్‌ హెచ్‌ఎం శేషిరెడ్డి, అంత్యాతండా హెచ్‌ఎం ఎస్‌కె మస్తాన్‌, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్‌, బాలాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రత్నవరంలో..



నడిగూడెం : రత్నవరంలో

నడిగూడెం : మండలంలోని రత్నవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధ్యానోపాధ్యాయుడు ఎం.పుల్లయ్య, ఉపాధ్యాయులు ఎం.కరుణ, రాజశేఖర్‌, నరద్మ, సీఆర్‌పీ నందిగామ రామారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

నేరేడుచర్ల : క్షయ రహిత భారత్‌ ప్రతిఒక్కరి బాధ్యత అని నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని పున్న నాగిని అన్నారు. మంగళవారం నేరేడుచర్ల మున్సిపల్‌ కార్యాలయం ఆవరణలో నిక్షయ్‌ శివిర్‌ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన క్షయ వ్యాధి నివారణ శిబిరంలో ఆమె మాట్లాడారు. దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, రక్తం పడటం, నీరసం వంటి లక్షణాలు ఉంటే డాక్టర్‌ సంప్రదించి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో డిజిటల్‌ టెస్ట్‌, ఎక్స్‌రే, రక్తపోటు, మధుమేహం వంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ యడవల్లి అశోక్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్‌ ఆఫీసర్‌ సల్వాది, శ్రీనివాస్‌, దైద వెంకటేశ్వర్లు, రమ్య, విద్య, రచన, శారద, మమత, కిరణ్‌, ప్రసాద్‌, నర్సయ్య, సునిత, గురువమ్మ, యశోద, రాజ్యం, మంజుల, విజయ నిర్మల, మున్సిపల్‌ సిబ్బంది వెంకట్‌, జానీ, శ్రీకాంత్‌ తదితరులు ఉన్నారు.

అంబేద్కర్‌ దీక్ష మాల ధరించడం గొప్ప వరం



నరహరికి రాజ్యాంగాన్ని అందిస్తున్న నాయకులు

గరిడేపల్లి : ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ దీక్ష మాల ధరించడం గొప్పవరం అని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు రాపోలు నవీన్‌ అన్నారు. మండలంలోని పొనుగోడు గ్రామంలో తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌ సైదులు పూలే ఆధ్వర్యంలో అంబేద్కర్‌ వాది నందిపాటి నరహరి మంగళవారం అంబేద్కర్‌ దీక్ష మాల ధరించారు. ఆయనకు యువకులు, నాయకులు మద్దతు తెలిపి భారత రాజ్యాంగాన్ని అందించి సన్మానించారు. రామ్మూర్తి, కేశవ్‌, మధు, శివ, రమేష్‌, సతీష్‌, నవీన్‌, నాగరాజు, గౌస్‌, రాజేష్‌, భిక్షం, వీరబాబు, రవి, ఏసు, లింగస్వామి, శ్రవణ్‌, నరేష్‌, సందీప్‌ పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెచ్‌ కానిస్టేబుల్‌

పాలకవీడు : సైబర్‌ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక పోలీస్‌ స్టేషన్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ అంజయ్యగౌడ్‌ అన్నారు. మంగళవారం పాలకవీడు మండలంలోని డెక్కన్‌ సిమెంట్‌ పరిశ్రమ పాఠశాలలో పోలీస్‌ కళా బృందం సభ్యులతో కలిసి సైబర్‌ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంక్‌ ఖాతా, ఓటీపీ, ఏటీఎం కార్డు నంబర్లను ఇతరులకు తెలపవద్దన్నారు. సైబర్‌ మోసాలపై 1930 టోల్‌ ఫ్రీ నంబర్‌కు, 100కు ఫోన్‌ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్‌ సిబ్బంది, కళా బృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ పార్టీ గ్రామ అభివృద్ధి కమిటీ ఎన్నిక



కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు వీరారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గురువయ్య

హుజూర్‌నగర్‌రూరల్‌ : గోపాలపురంలో కాంగ్రెస్‌ పార్టీలో ఉంటూనే బీఆర్‌ఎస్‌ పార్టీతో కుమ్మక్కై పార్టీకి ద్రోహం చేస్తున్న వారిని సస్పెండ్‌ చేయాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ గురువయ్య కోరారు. ఈమేరకు గోపాలపురంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్‌ పార్టీ గ్రామ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు చెక్కెర వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం కాంగ్రెస్‌ పార్టీ గ్రామ అభివృద్ధి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా శాసనాల నాగసైదయ్య, చీకూరి అంజయ్య, గురువయ్య, సైదులు, వెంకటేశ్వరరావు, బండెల్లి, రంజిత్‌, మల్లిఖార్జున్‌, రాంమోహన్‌రెడ్డి, భిక్షం, అనిల్‌, భాగ్యరాజ్‌, భైషయ్య, సుందరయ్య, నాగుల్‌మీరాను ఎన్నుకున్నారు.

మోడల్‌ ఇందిరమ్మ ఇల్లు పరిశీలన

మునగాల : ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మునగాల మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న మోడల్‌ ఇంటిని మంగళవారం కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల జైపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా నాయకులు కాసర్ల కోటేశ్వరరావు, పార్టీ మండల నాయకులు కాలె సామియేలు, ఈదారావు, ముస్కుల సైదిరెడ్డి, యూత్‌ కాంగ్రెస్‌ పార్టీ నాయకులు షేక్‌ పాషా, కిరణ్‌ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మేస్త్రిలకు శిక్షణ

హుజూర్‌నగర్‌రూరల్‌ : నియోజకవర్గంలో త్వరలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో తాపీ మేస్త్రిలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణానికి సంబంధించి ముగ్గు పోసి మేస్త్రీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లావణ్య, కార్యదర్శులు, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌ క్లబ్‌కు బహూకరణ

నేరేడుచర్ల : నేరేడుచర్ల లయన్స్‌ క్లబ్‌ కార్యాలయానికి పీఎం జీఎఫ్‌ లయన్‌ రేపాల మధన్‌మోహన్‌ బ్లడ్‌ ప్రెషర్‌ మానిటర్‌ (బీపీ ఆపరేటర్‌), బరువును కొలిచే మిషన్‌ను మంగళవారం అందజేశారు. లయన్‌ క్లబ్‌ అధ్యక్షుడు జిలకర రామస్వామి, డిస్ట్రిక్‌ చైర్మన్‌ బట్టు మధు మాట్లాడుతూ..క్లబ్‌ చేపట్టే వైద్య శిబిరాల్లో ప్రాథమికంగా అవసరమయ్యే పరికరాలను అందజేసిన మధన్‌మోహన్‌కు క్లబ్‌ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్‌ చార్టెడ్‌ ప్రెసిడెంట్‌ కొణతం సీతారాంరెడ్డి, ఉపాధ్యక్షుడు రాచకొండ శ్రీనివాసరావు, గుండా సత్యనారాయణ, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, తక్కెళ్ల నాగార్జున, లయన్స్‌ క్లబ్‌ నాయకులు ఉన్నారు.

పరువు హత్య తీర్పు.. ఒక గుణపాఠం కావాలి

హుజూర్‌నగర్‌రూరల్‌ : పరువు హత్య తీర్పు.. ఇలాంటి నేరాలకు పాల్పడే వారికి ఒక గుణపాఠం కావాలని విన్నపం పోరాటం సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌ మండలంలోని గోపాలపురంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. మిర్యాలగూడలో కులాంతర వివాహం చేసుకున్న ప్రణయ్‌ హత్య కేసులో ఇచ్చిన తీర్పుతో బిడ్డల జీవితాలను బలితీయడమే పరిష్కార మార్గం కాదని ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

మేళ్లచెరువులో పోస్టల్‌ సిబ్బంది చేతివాటం

మేళ్లచెరువు : మండల కేంద్రంలో వృద్ధాప్య పింఛన్‌ పంపిణీలో పోస్టల్‌ సిబ్బంది చేతివాటం ప్రదర్శించిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన ఎస్‌.కుమార్‌ గత పది నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అయినా లిస్టులో పేరును తొలగించకుండా ఆయన పేరు మీద వస్తున్న వృద్ధాప్య పింఛన్‌ను పోస్టల్‌ మహిళా సిబ్బంది కాజేసింది. మృతుడి ఆధార్‌ కార్డును సైతం సంపాదించిన ఆమె ప్రతినెల పెన్షన్‌ నొక్కేసింది. అయితే వేలిముద్ర పడని వారికి ప్రతినెల గ్రామ పంచాయతీ బిల్‌కలెక్టర్‌ వేలిముద్ర వేస్తారు. కానీ లిస్టులో ఎస్‌.కుమార్‌ పేరు గమనించన బిల్‌ కలెక్టర్‌ వేలిముద్ర వేస్తున్నారు. దీంతో ఆ మె ప్రతినెల కుమార్‌ పేరు మీద వచ్చే పెన్షన్‌ కాజేసింది పోస్టల్‌ మహిళా సిబ్బంది. ఇటీవల విషయం బయటకు రావడంతో పంచాయతీ సిబ్బందికి, పోస్టల్‌ సిబ్బందికి మధ్య వివాదం జరిగింది. మృతుడి భార్యకు కూడా ఈ విషయం తెలిసి పంచాయతీ, పోస్టల్‌ సిబ్బందిని నిలదీసింది. దీంతో పోస్టల్‌ మహిళా సిబ్బంది సెలవుపై అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం. విషయం గ్రామ పెద్దల దృష్టికి రావడంతో వారు రాజీ చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.